

911 ఎకరాల పట్టా భూములు నిషేధిత జాబితాలోకి..

సదుం మండలం పచ్చార్లమాకులపల్లెకు చెందిన అప్పిరెడ్డి శ్రీహరి 2023లో కర్నూలు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.ఆవులపల్లె పంచాయతీలోని సర్వే నెంబరు 37 తదితర నెంబర్లలోని 911.34 ఎకరాలు ప్రభుత్వ భూములని, వెంటనే వాటిని నిషేధిత జాబితా 22ఏ (1)(బీ)లో చేర్చాలని కోరారు. దీంతో లోకాయుక్త ఆదేశాలతో నాటి కలెక్టర్ నంగిలి షన్మోహన్ సర్వే నెంబర్లు 33/1, 39, 41, 45, 46, 47, 49, 59, 55. 60. 63, 64, 60, 71, 71, 73, 76లోని 55 మంది రైతులకు చెందిన 911.44 ఎకరాలు 22ఏ జాబితాలో చేర్చాలని 2023 డిసెంబరు 14వ తేది ఉత్తర్వులిచ్చారు.ఎన్జీటీకి ఫిర్యాదు చేశారన్న కక్షతోనే అధికారం అండగా వైసీపీ నేతలు ఇలాంటి ఉత్తర్వులు ఇప్పించారని రైతులు వాపోతున్నారు. కానీ ఈ విషయం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే వెలుగు చూసింది.

పోరాడుతున్నా దక్కని న్యాయం

60 ఏళ్లుగా శిస్తు చెల్లిస్తున్న సెటిల్‌మెంట్ భూముల్ని నోటీసులు ఇవ్వకుండా ఫారెస్టు భూములంటూ ట్రెంచ్‌లు తీసి బోర్డులు పెట్టారని అప్పట్లో రైతులు ఆవేదన చెందారు. తమ భూముల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సీసీఎల్ఏ, కలెక్టర్, ఆర్డీవోలను కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. గత ఏడాది ఆగస్టు 5న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆవులపల్లెను సందర్శించి రైతులకు న్యాయం చేస్తానని, సీతమ్మ చెరువు గతంలాగే మారుస్తామని హామీ ఇచ్చారు. తర్వాత జేసీ విద్యాధరి, ఆర్డీవో ఆవులపల్లె వెళ్లి విచారించి రావడం తప్ప న్యాయం జరగలేదు.

ఆవులపల్లె వద్ద నిషేధిత జాబితాలో చేరిన సెటిల్‌మెంట్ భూములు



ఈ రైతుల రాత మారదా?

రిజర్వాయర్‌ను అడ్డుకున్నారని 55మంది ఆవులపల్లెవాసులపై కక్షసాధింపు

- 60ఏళ్ల నాటి సెటిల్‌మెంట్ భూములను 22ఏ జాబితాలోకి ఎక్కించిన వైసీపీ నేతలు
- ప్రభుత్వం మారినా బాధితులకు దక్కని న్యాయం

పుంగనూరు, ఆంధ్రజ్యోతి

వైసీపీ హయాంలో సోమల మండలం ఆవులపల్లెలో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు అడ్డుపడుతున్న రైతుల్ని ఇబ్బంది పెట్టారు. 55 మంది రైతులకు చెందిన 911 ఎకరాల పట్టా భూముల్ని నిషేధిత జాబితాలోకి ఎక్కించేశారు. అదనంగా వారిపై కేసులు బనాయించి ఇబ్బంది పెట్టారు. ప్రభుత్వం మారి ఏడాది దాటినా ఆ బాధిత రైతులకు న్యాయం జరగలేదు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ప్రాతినిధ్యం వహించిన పుంగనూరు నియోజకవర్గంలోని సోమల మండలం ఆవులపల్లె వద్ద సీతమ్మ చెరువు కట్టను తెంచి ఆ స్థానంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఏడాదికి మూడు పంటలు పండే వ్యవసాయ భూములు, అనేక గ్రామాలు నీట మునుగుతాయని... వేలాది మామిడి, కొబ్బరి, సపోటా చెట్లు నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సీతమ్మ చెరువు వెనుక భాగంలో ఎవరికీ నష్టం జరగకుండా ప్రభుత్వ భూమిలో రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న పెద్దిరెడ్డి కుటుంబ సంస్థ పీఎల్ఆర్ ప్రాజెక్టు వారు మాత్రం అదే స్థలంలో నిర్మిస్తామని పట్టుపట్టి భయానక వాతావరణం సృష్టించారు.నీటి ముంపునకు గురయ్యే కొన్ని పొలాలతో పాటు గుట్టలు, చెట్లను చదును చేసేశారు.

● ఎన్జీటీకి ఫిర్యాదు చేశారని రైతులపై కక్ష సాధింపు

భూములు పోగొట్టుకున్న ఆవులపల్లె రైతులు 2021లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)కు ఫిర్యాదు చేశారు.అప్పటి నుంచి ఆవులపల్లె పంచాయతీకి చెందిన ఆవులపల్లె, బయ్యారెడ్డిపల్లె, చిన్నదేవళకుప్పం, పెద్దదేవళకుప్పం, మల్లేశ్వరం, రామకృష్ణాపురం రైతులకు పోలీసు, రెవెన్యూ, జలవనరులశాఖ, అటవీశాఖ అధికారుల నుంచి ఇబ్బందులు మొదలయ్యాయి. ఎన్జీటీకి ఫిర్యాదు వెళ్లిన వారం నుంచి తప్పుడు కేసులు, దాడులు, దౌర్జన్యాలు తదితర వేధింపులతో పాటు రెవెన్యూ రికార్డుల్లో మార్పులు మొదలయ్యాయి.చివరకు పర్యావరణ అనుమతులు లేకుండానే రిజర్వాయర్లు నిర్మిస్తున్నారని ఎన్జీటీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ జగన్ ప్రభుత్వానికి రూ.100 కోట్లు భారీ జరిమానా విధించింది. ఆవులపల్లెతో పాటు పుంగనూరు మండలంలోని నేతిగుట్లపల్లె, అన్నమయ్య జిల్లాలోని కురబలకోట మండలం ముదివేడు ప్రాంతాల్లో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని 2023 మే 11వతేది సంచలన తీర్పు ఇచ్చింది.దీనిపై రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా వెంటనే రూ.25 కోట్లు కృష్ణాబోర్డుకు చెల్లించాలని ఆదేశించింది.చివరకు రిజర్వాయర్ నిర్మాణ పనులు ఆగిపోయాయి.దీంతో పనులు ఆపేయించిన రైతులపై వైసీపీ నేతలు అధికారుల ద్వారా కక్ష సాధింపు మొదలుపెట్టారు.ఎన్జీటీ ఆదేశాలు వచ్చేటప్పటికే నేతిగుట్లపల్లె, ముదివేడు ప్రాంతాల్లో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు 75శాతం పూర్తయిపోయాయి.పొలాలు కోల్పోయిన రైతులు పరిహారం అందక, వ్యవసాయమూ చేసుకోలేక పూర్తిగా నష్టపోయారు.



సీఎం చంద్రబాబును కలిసి న్యాయం కోరుతున్న బాధిత రైతులు(ఫైల్‌ఫొటో)

రిజర్వాయర్ల పనులాగిపోవడంతో ఆవులపల్లె వద్ద ఉన్న కమ్మి తదితర నిర్మాణ సామగ్రిని తరలించడానికి గతంలో రెండు మార్లు పీఎల్ఆర్ ప్రాజెక్టు వారు ప్రయత్నించారు. అయితే బాధిత రైతులు అడ్డుకుని తెగ్గొట్టిన సీతమ్మ చెరువు నిర్మించాలని, తమ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని పట్టుబట్టగా అధికారులు హామీలిచ్చారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఒత్తిడితో కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధిత రైతులను విచారించి, సీసీఎల్ఏకు నివేదిక పంపుతానని, ఉత్తర్వులు రాగానే 1బీ, అడంగల్ ఇస్తామని

● అమలు కాని హామీలు

హామీ ఇచ్చారు.అయినప్పటికీ ఇంతవరకూ వారికి న్యాయం జరగలేదు.ఈ విషయమై సోమల ఇన్‌చార్జి తహసీల్దార్ మధుసూదన్‌ను అడగ్గా పలుమార్లు ఆర్డీవో, జేసీ భూములు పరిశీలించారన్నారు. 911 ఎకరాల వ్యవసాయ భూముల 1బీ సమస్యపై విచారించి ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆ భూములపై చర్యలు తీసుకుంటామన్నారు.

మా భూముల్లోకే వెళ్లనిచ్చేవారు కాదు



ఆవులపల్లె పంచాయతీలో మాకు 35 ఎకరాలు భూముండేది. అన్యాయంగా మాలాంటి టీడీపీ సానుభూతిపరుల భూములను అప్పటి తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి నిషేధిత జాబితాలో పెట్టారు.చివరకు మా భూముల్లోకి వెళ్లాలన్నా పీఎల్ఆర్ కాంట్రాక్టర్ మనుషులు వెంబడిస్తూ బెదిరించేవారు.ఎన్జీటీకి ఫిర్యాదు చేశాక నాపై ఫారెస్టు, పోలీసు తప్పుడు కేసులు పెట్టారు.ప్రభుత్వం మారినా ఇంతవరకు మాకు న్యాయం జరగలేదు.

- సోంపల్లె లక్ష్మీపతినాయుడు, చిన్నదేవళకుప్పం

1బీ రాక బ్యాంకు రుణాలు రావడం లేదు



రిజర్వాయర్ వచ్చిందిలేదు కానీ మా పట్టా భూములను తహసీల్దార్ ప్రభుత్వ భూమిగా మార్చేశారు. నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్, డాక్యుమెంట్లు, గతంలోని టెన్‌వన్, అడంగల్లు అన్నీ ఉన్నాయి. మా ఆధీనంలోనే మా భూముల్లో సేద్యం చేస్తున్నాం.అయితే పంటల సాగుకు బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదు. మీ భూములు ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఉన్నాయంటున్నారు.సీఎం చంద్రబాబు మా భూములను గతంలోలా మార్చి ఇవ్వాలి. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి.

- రామలింగాచారి, బయ్యారెడ్డిపల్లె

మన మిత్రలో పింఛన్ల వినతులకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):పింఛన్లపై వినతులను వాట్సప్ మనమిత్రలో పంపే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.సమస్యలను మన మిత్ర వాట్సప్ నెంబర్ 95523 00009లో పోస్ట్‌చేసి ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు. పింఛన్‌దారుల ఫిర్యాదు స్థితి, పరిష్కారం వంటి వివరాలను ఇంటినుంచే తెలుసుకోవచ్చు.ఇటీవల పింఛను తీసుకుంటున్న వారిని క్షేత్రస్థాయిలో వైద్యులతో వెరిఫికేషన్ చేయించిన ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11,074మందిని అనర్హులుగా తేల్చిన విషయం తెలిసిందే.వీరిలో చాలామంది తాము అర్హులమైనా తొలగించారంటూ ఆందోళన చెందుతున్నారు. ఇలాంటివారికోసం పునర్విచారణ చేయించనున్నారు.ఈ నేపథ్యంలో పింఛన్లపై మన వినతులను మనమిత్రకు పంపాలంటే....తొలుత మనమిత్ర నెంబరును ఫోనులో సేవ్ చేసుకోవాలి.ఆ వాట్సప్ నెంబరుకు హాయ్! అని సందేశం పంపాలి. మీకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీ వాట్సప్‌లో ఏఐ ఆధారిత్ చాట్‌బాక్స్‌లో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో పింఛన్ల సమస్య సేవను ఎంపిక చేసుకోవాలి. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. (మీ ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ లేదా సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ లాంటివి). ఈ వివరాలు టెక్స్ట్ రూపంలో పంపాలి. మీరు ఇచ్చిన వివరాలను ఒకసారి తనిఖీ చేసిన తర్వాత అందులో సిస్టమ్ మీకు రియల్ టైం అప్‌డేట్స్ లేదా ఒక కన్ఫర్మేషన్ సందేశాన్ని పంపుతుంది. అక్కడినుంచి అధికారులకు వద్దకు వెళ్ళి మీ వినతులను పరిష్కరిస్తుంది.

కాణిపాకంలో మాక్ డ్రిల్



స్పృహ తప్పిన వ్యక్తిని కాపాడడమిలా..

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భక్తులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఆర్ ఏఎస్పీ నందకిషోర్, వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ సూచించారు. మంగళవారం ఆలయం వద్ద పోలీసులు అనూహ్య సంఘటనలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుకోని సంఘటనలు జరిగితే చాకచక్యంగా వ్యవహరించాలని చెప్పారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా పెద్ద ప్రమాదం జరగకుండా చూసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగితే మంటలు వ్యాపించకుండా చేయాలని, అవసరమైన పరికరాలను దగ్గర్లో ఉంచుతామని తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ ఆర్‌ఐ సుధాకర్, ఎస్‌ఐ నరసింహులు, అగ్నిమాపక, వైద్యశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

‘అన్నదాత సుఖీభవ’ ఫిర్యాదులకు నేడు ఆఖరు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ‘అన్నదాత సుఖీభవ’ అర్హత కలిగి లబ్ధి పొందని రైతులు బుధవారం లోపు రైతు సేవా కేంద్రాల్లో ఫిర్యాదులు నమోదు చేయాలి. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



పెద్దచెరువుకు గండి పడిన చోట మరింత వెడల్పు చేసి పూడ్చివేసిన అధికారులు

పెద్ద చెరువు గండి పూడ్చివేత



పలమనేరు పెద్దచెరువు కట్టకు గండి కొట్టిన సంఘటన పై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులతో సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలమనేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పెద్ద చెరువుకట్టకు గండి కొట్టడంపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది.ఆక్రమణదారుల కోసం మున్సిపల్ అధికారులే వైసీపీ నేత సూచనలతో చెరువుకు గండి కొట్టడంపై ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, బీజేపీ నాయకులు, అధికారులు స్పందించి గండిని పూడ్పించారు.గండికొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు శరవణకుమార్, వంశీ, జగన్, వక్తిప్రసాద్,కృష్ణప్ప తదితరులు తహసిల్దార్ ఇన్బనాథన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.మరోవైపు మంగళవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి. రమణారెడ్డి, తహసిల్దార్ ఇన్బనాథన్, ఇరిగేషన్ డీఈ నాయక్ చెరువు కట్ట గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఎక్సకవేటర్‌ను తెప్పించి చెరువు కట్టకు మరమ్మతులు చేశారు. గతంలో ఉన్న కట్ట వెడల్పును పెంచి గండి పూడ్చివేశారు. భవిష్యత్తులో ఎవరూ చెరువు కట్టకు గండి కొట్టే అవకాశాలు లేకుండా కట్టకు మరమ్మతులు చేశారు. గండికొట్టిన ఉదంతంపై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మంగళవారం మధ్యాహ్నం అధికారులతో సమీక్షించారు. పట్టణానికి ఆనుకొనే ఉన్న చెరువులో నీరు నిల్వవుండేలా చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలను ఉపేక్షించవద్దని సూచించారు. పెద్దచెరువులో దాదాపు 260 మంది ఆక్రమణదారులకు ఇదివరకే పట్టాలు ఇచ్చిన విషయాన్ని మున్సిపల్ ప్లానింగ్ అధికారిణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గతంలో ఎప్పుడూ ఆక్రమణదారులు చెరువు నిండి తమ ఇళ్లు జలమయమయ్యాయని చెప్పలేదన్నారు. ఇటీవల ఎవరైనా చెరువులో ఇళ్లు నిర్మించుకొని వుండి వారి ఇళ్లలోకి చెరువు నీరు వస్తున్నందున వారే ఎవరైనా కట్టకు గండికొట్టివుంటారనే విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దచెరువు నిండి కలుజు పారినప్పుడు గతంలో రాజకాలువ మీదుగా బొమ్మిదొడ్డిచెరువుకు అక్కడ కలుజు పారితే ఆ నీరు కౌండిన్య నదికి చేరుకొనేదని, అయితే ఈ రాజకాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురికావడంతో కలుజు నీరంతా ఆయకట్టులోని పొలాలపై వెళ్లాల్సి వస్తోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పూర్తిగా కలుజు నీరు వెళ్లేలా రాజకాలువలను తయారు చేయాలని, ఇందుకోసం నిధులు కూడా అందుబాటులో వున్నాయని తెలిపారు.

ఎస్వీఎంసీలో పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్ల ప్రారంభం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాలలో (ఎస్వీఎంసీ) రెండేళ్ల కాలవ్యవధి పారామెడికల్(అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ రవిప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అర్హులని తెలిపారు. కోర్సులకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబరు 8వ తేది సాయంత్రం 5 గంటల్లోపు రూ.100తో కలిపి కళాశాలలోని పారామెడికల్ విభాగంలో అందించాలన్నారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 94408 79943 నెంబరులో సంప్రదించాలన్నారు.

14 మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 14 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. చౌడేపల్లె, వి.కోటలో 4.2, పెద్దపంజాణిలో 3, గుడుపల్లెలో 2.6, నగరి, గంగవరంలో 2.4, పలమనేరులో 2.2, కార్వేటినగరంలో 1.8, పెనుమూరులో 1.4, పూతలపట్టులో 1.2, వెదురుకుప్పం, పుంగనూరు, శాంతిపురం, బంగారుపాళ్యంలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ నేడు ప్రారంభం

● వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

శ్రీకాళహస్తి/రేణిగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్, రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ బుధవారం ప్రారంభం కానున్నాయి. అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో వీటిని ప్రారంభిస్తారని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు పాల్గొననున్నట్లు తెలిపారు.

డ్యూటీ టైంలో బయట తిరుగుతారా?

- సచివాలయ లైన్‌మెన్ సంఘు నాయకులపై కలెక్టర్ సీరియస్
- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- నలుగురు జేఎల్‌ఎంలకు నోటీసులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ లైన్‌మెన్(జేఎల్ఎం గ్రేడ్-2) సంఘ నాయకులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వారిపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ను ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జేఎల్ఎం నాయకులు హాజరయ్యారు.ఉన్నతోద్యోగాలు పొందడానికి రాత్రి కళాశాలకు వెళ్లి చదువుకుంటామని అధికారులను కోరినా స్పందించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న జేసీ విద్యాధరి గతంలో సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తుచేశారు. సచివాలయ, విద్యుత్ అధికారులతో సమస్యపై చర్చించినట్లు తెలిపారు. అత్యవసర సేవల విభాగంలో పనిచేస్తున్న వారికి ఉదయం విధులు, రాత్రివేళ శిక్షణకు దీర్ఘకాలిక అనుమతి ఇవ్వడం కుదరదని చెప్పామన్నారు. కావాలంటే సెలవు పెట్టుకొని శిక్షణ తీసుకోవచ్చుని తెలియజేసినట్లు వెల్లడించామన్నారు. దీంతో కలెక్టర్ ఆగ్రహించి సంబంధిత అధికారులతో విషయం మాట్లాడాక కొత్తగా తనకు తెలపడం ఏమిటన్నారు. పైగా అధికారులు అనుమతి ఇవ్వడం లేదని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ని పిలిచి విధి నిర్వహణ సమయంలో వచ్చిన జేఎల్ఎంలు అనుమతి కానీ సెలవు కానీ తీసుకున్నారా అని అడగ్గా తీసుకోలేదని ఆయన చెప్పడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో నలుగురు ఉద్యోగ సంఘ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.డ్యూటీ టైంలో అనుమతి తీసుకోకుండా బయట తిరుగుతున్న కారణంగా ఈ నోటీసులు ఇచ్చారు.అలాగే ఆ జేఎల్ఎంలకు సంబంధించిన నలుగురు ఏఈలకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారు.





రమ్యశ్రీ,ఆమని - ప్రియదర్శి

తిరుమలలో సినీ నటుల సందడి

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. వీరిలో ఆమని, రమ్యశ్రీ, ప్రియదర్శి ఉన్నారు. ఇంకా తెలంగాణ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజున కుటుంబం అంతా కలిసి స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో నీటి నిల్వలపై అదనపు ఈవో సమీక్ష



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నీటి నిల్వలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లోని డ్యాముల్లో నీటి లభ్యత, వినియోగంపై చర్చించారు. తిరుమలలోని గోగర్భం, కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ, తిరుపతిలోని కల్యాణి డ్యాముల్లో ప్రస్తుతం భక్తుల అవసరాలకు నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు నివేదించారు. భవిష్యత్తులో నీటి నిల్వల సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశాలను పరిశీలించాలని అదనపు ఈవో సూచించారు. ఈ సమీక్షలో వాటర్‌వర్క్స్ ఈఈ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిది షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.88 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,502

తలనీలాలు సమర్పించినవారు: 31,890

రైల్వే వంతెన కింద ఇరుక్కున్న ట్యాంకర్

● గంటన్నరకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం



రేణిగుంట ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని రైల్వే వంతెన కింద గ్యాస్ ట్యాంకర్ ఇరుక్కుంది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలకు గ్యాస్ తీసుకెళ్లే ట్యాంకరుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని భావించారు. శ్రీకాళహస్తి వైపు నుంచి ఖాళీ గ్యాస్ ట్యాంకరుతో తిరుపతి అర్బన్ మంగళంలోని ఆర్టీవో కార్యాలయానికి బయలదేరారు. దారి తెలియక పాత చెక్‌పోస్టు మీదుగా రైల్వే వంతెన కింద ట్యాంకరును వెళ్లనిచ్చారు. ఈ క్రమంలో భారీ పరిమాణం కలిగిన ట్యాంకరు ఆ దారిలో ఇరుక్కుపోయింది. దాదాపు ఒకటిన్నర గంటసేపు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్సు చిక్కుకు పోయింది. ఈ విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అబార్షన్ కిట్లు, డ్రగ్స్ స్వాధీనం

వరదయ్యపాళెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలోని ఓ మందుల దుకాణంలో చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న అబార్షన్ కిట్లను, డ్రగ్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్వాధీనం చేసుకున్నారు.మండలకేంద్రంలోని మందుల దుకాణాల్లో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (శ్రీకాళహస్తి) ప్రశాంతి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఓ మందుల దుకాణంలో ఎలాంటి అనుమతులుల లేకుండా చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న 140 అబార్షన్ కిట్లను స్వాధీనం చేసుకున్నారు. రోగులకు మత్తు ఇవ్వడానికి వినియోగించే డ్రగ్స్‌ను అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

తిరుమల ఏటీఎంలో కర్ణాటక వాసి హంగామా



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో సోమవారం రాత్రి ఒక వ్యక్తి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి నానా హంగామా సృష్టించాడు. రాత్రి 11.30 గంటల సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ ముందున్న ఏటీఎంలోకి ప్రవేశించిన అతడు పలుచోట్ల వైర్లను కట్ చేశాడు. అనంతరం ఏటీఎం మిషన్ చుట్టూ అనుమానాస్పదంగా తిరిగాడు. ఈ దృశ్యాలన్నీ మరో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో బ్యాంక్ అధికారులు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం ఉదయం కల్యాణకట్ట వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటకకు చెందిన ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించామని, మానసిక స్థితి సరిగాలేదని సీఐ శ్రీరాముడు తెలిపారు. అయినప్పటికీ గతంలో ఏమైనా నేరాలకు పాల్పడ్డాడా అనే కోణంలోనూ విచారిస్తున్నామన్నారు.

అటువంటి ఆలయం ఇక్కడొద్దు

● కొండూరులో గుడి నిర్మాణంపై గ్రామస్తుల అభ్యంతరం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు శరత్‌బాబు

తడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలోని కొండూరులో వివాదాస్పదంగా మారిన దేవాలయ నిర్మాణం విషయమై మంగళవారం తహసీల్దారు శరత్‌బాబు గ్రామసభ నిర్వహించారు. గుంట పోరంబోకు భూమిలో చాముండేశ్వరిదేవి ఆలయం పేరుతో నిర్మాణాలు మొదలుపెట్టి, అందులో చేతబడులు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కొండూరులో గ్రామసభ నిర్వహించి స్థానికుల అభిప్రాయాలు తీసుకుని నివేదిక పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. దీంతో తహసీల్దారు గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో పాటు పంచాయతీ వార్డు సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు వంతులకుపైగా గ్రామస్తులు అటువంటి దేవాలయం ఇక్కడ వద్దని, వెంటనే దానిని తొలగించాలంటూ తహసీల్దారుకు విన్నవించారు. తమకు సమాచారం ఇవ్వకుండా, అజెండాలో పేర్కొనకుండా దేవాలయ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వడంపై పలువురు వార్డు సభ్యులు అభ్యంతరం తెలిపారు. వెంటనే వార్డుసభ్యుల సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను నమోదు చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీ అధికారులను తహసీల్దారు ఆదేశించారు. ఈ నివేదికలన్నింటిని ఉన్నతాధికారులకు పంపి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్‌బాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు కొండపనాయుడు, బ్రహ్మనాయుడు, సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.పది లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.పది లక్షల విరాళం అందింది. బెంగళూరుకు చెందిన వినుత గణేష్ ఈ విరాళ చెక్కును తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో ముందస్తు తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం బుధవారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తారన్న సమాచారం తెలియడంతో మంగళవారం స్టేషన్‌లో అధికారులు ముందస్తు తనిఖీలు చేశారు. బాధ్యతలు చేపట్టిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ స్టేషన్‌లో ఏ ప్రాంతంలో పర్యటిస్తారో తెలియక అన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నపరెడ్డిలతో పాటు కమర్షియల్, ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మఠం భవనాల కూల్చివేతకు తొందరపడం

● ప్రత్యక్షంగా పరిశీలించాకే నిర్ణయమన్న కలెక్టర్ ● ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం నడిబొడ్డున గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం పరిపాలనా భవనం కూల్చివేత నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. రెండంతస్తుల ఈ పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకర స్థితిలో ఉన్న పై అంతస్తునూ, అదే స్థితిలో ఉండే కింది అంతస్తులోని షాపింగ్ గదులనూ కూల్చివేయచ్చంటూ దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేయడంతో స్థానికంగా నిరసనలు మొదలయ్యాయి. తమ బతుకు తెరువుతో ముడిపడిన అంశమని షాపుల వాళ్లు అభ్యంతరం తెలిపారు. దీనిపై మంగళవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇతర ప్రజాప్రతినిధులు, మఠం, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. పలువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కూల్చకుండా ప్రయత్నిస్తాం: ఎమ్మెల్యే ఆరణి

భవనాన్ని పాక్షికంగా కూల్చాలని మాత్రమే ఆదేశాలు వచ్చాయని, 62 షాపుల్లో కేవలం 12 మాత్రమే కూలుస్తారని, అవి కూడా కొట్టకుండా పునరుద్ధరించే అవకాశముందేమో చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ భవనం స్థితిగతులను పరిశీలించేందుకు ఐఐటీ నిపుణులకు కలెక్టర్ లేఖ రాయాలని కోరారు. అలాగే హథీరాంజీ మఠం తిరుపతికి గుండె లాంటిదంటూ, ఆధునిక టెక్నాలజీని వాడుకుని భవనాన్ని పరిరక్షించుకునే దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ సూచించారు. భవనాన్ని



ఎలా నిలబెట్టాలో ఆలోచించాలని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కోరారు. ఇదే వయసున్న భవనాల విషయంలో టీటీడీ ఏం చేస్తోందో పరిశీలించాలని సూచించారు. 'తిరుపతిలో ఇంట్లో చావైనా, పెళ్లైనా ముందుగా వెళ్ళేది మఠం భవనంలో నడుస్తున్న పువ్వుల దుకాణాలకే. వాటిని కూల్చవద్దు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. రిట్రోఫిట్టింగ్ విధానంలో మఠం భవనాన్ని కూల్చకుండా పటిష్టం చేసే వీలుంది.' అని టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. తిరుపతికి ల్యాండ్ మార్క్ ఈ భవనాన్ని కూల్చకుండా కాపాడాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఒకవేళ మఠం భవనాన్ని కూల్చేసి తిరిగి కడితే ఇపుడున్న వ్యాపారులకే మళ్ళీ షాపులు కేటాయిస్తారా? అని నగర బీజేపీ అధ్యక్షుడు వరప్రసాద్ ప్రశ్నించారు. కూల్చకుండానే పునరుద్ధరించి ఇపుడున్న వ్యాపారులకే ఆ షాపులు ఇస్తామంటే తక్షణం షాపులు ఖాళీ చేస్తామని కార్పొరేటర్ నరసింహాచారి చెప్పారు.

భవనం కూలితే బాధ్యత ఎవరిది?

● ప్రశ్నించిన కలెక్టర్

అందరి అభిప్రాయాలూ తెలుసుకున్న తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ, వందేళ్లకు పైబడిన పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుందని, అది కూలిపోయి ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని సూటిగా ప్రశ్నించారు. వ్యాపారుల జీవనోపాధి దెబ్బతీయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. తమ మొదటి ప్రాధాన్యత మనుషుల ప్రాణాలు కాపాడ్డమేనని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ అభ్యర్థనపై తిరుపతి ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారని, అనేక భాగాలు ప్రమాదకర స్థితిలో వున్నాయని నివేదిక ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే దేవాదాయ శాఖ కమిషనర్ భవనం కూల్చివేతకు టెండర్లు పిలిచారన్నారు. అయితే షాపుల్లో అద్దెకు వుంటున్న వ్యాపారులు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు రావడంతో తాత్కాలికంగా టెండర్ల అమలును నిలిపుతామని ప్రకటించారు. ఎమ్మెల్యే, కమిషనర్ సహా ప్రజాప్రతినిధులు, నేతలు, మఠం అధికారులు అందరితో కలసి వారం రోజుల్లో మఠం భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తామన్నారు. దానికి తిరుపతి ఐఐటీ, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను కూడా ఆహ్వానిస్తామన్నారు. ప్రత్యక్షంగా చూసిన తర్వాతే భవనం కూల్చివేతపై నిర్ణయం తీసుకుంటామన్నారు. భవనాన్ని కూల్చకుండా పటిష్టం చేసి పరిరక్షించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సంస్థకూ, పురావస్తు శాఖకు, ఐఐటీకి తానే లేఖలు రాస్తానన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో షాపులు తాత్కాలికంగా ఖాళీ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అది కూడా తాము భవనాన్ని నేరుగా పరిశీలించాకే అవసరమైతేనే ఖాళీ చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, హథీరాంజీ మఠం ఇంచార్జి ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బంజారా సంఘాల ప్రతినిధులు, షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.





అవార్డు అందుకుంటున్న లావణ్య కుమార్, సాయికుమార్

అవార్డులందుకున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచిన తిరుపతి 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్యకుమార్, కె.సాయికుమార్ అవార్డులు స్వీకరించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ల్యాప్ ట్యాప్‌ల చోరీ ఆ ఆగంతకుడి పనేనా?

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు

● ఐఐటీలో భద్రతా వైఫల్యంపై విమర్శలు

ఏర్పేడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో ల్యాప్‌టాప్‌ల చోరీ కలకలం రేపింది. శనివారం హాస్టల్ భవనాల్లో విద్యార్థులకు చెందిన 8ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయిన సంగతి తెలిసిందే. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో జరిగిన ఈ చోరీ ఘటనపై విచారణకు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఐఐటీని సందర్శించారు. హాస్టల్ భవనాలను తనిఖీ చేశారు. బాధిత విద్యార్థులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీతోపాలు పలు సాంకేతిక అంశాల ద్వారా నిందితుడ్ని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరా దుండగుడు?

శనివారం ఓ ప్రొఫెసర్ పేరుచెప్పి ఓ వ్యక్తి ఐఐటీలోకి వచ్చినట్లు తెలుస్తోంది. తమ పిల్లల యోగక్షేమాలు తెలుసుకోవడానికివెళుతున్నానని అతడు చెప్పినట్లు సమాచారం. ఈక్రమంలో హాస్టల్ గదుల్లో ఎనిమిది మంది విద్యార్థుల ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి తన వాహనంలో పెట్టుకుని ప్రధాన మార్గంలోనే వెళ్లిపోయాడని భావిస్తున్నారు. ఈ విషయంలో భద్రతా సిబ్బంది తీరు విమర్శలకు దారితీస్తోంది. ఆగంతకుడు సులభంగా లోపలికి రావడం, వెళ్తున్నప్పుడు తనిఖీ చేయకపోవడం చోరీకి ప్రధాన కారణమంటున్నారు. దుండగుడు లోపలికి ప్రవేశించడం వెనుక ఐఐటీకి చెందిన ఓ అధికారి హస్తమున్నట్లు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శాప్ నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. రాయలసీమ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి 2,362మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, షటిల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ క్రీడాంశాలలో తలపడ్డారు. రెండు రోజులుగా ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలు బాలబాలికలతో కళకళలాడాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. విజేతజట్లకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పురుష విభాగంలో ఆర్చరీలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో ఒకరు, షటిల్ బాడ్మింటన్ ఒకరు, బాక్సింగ్‌లో 10మంది, హాకీ జట్టు, వాలీబాల్ జట్టు, మహిళా విభాగంలో ఆర్చరీలో ఒకరు, అథ్లెటిక్స్‌లో ఇద్దరు, షటిల్‌బ్యాడ్మింటన్ ఇద్దరు, బాక్సింగ్‌లో ఏడుగురు, హాకీ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.



పురుషుల హాకీ విజేత



మహిళల హాకీ విజేత

డీఫార్మసీ దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డీఫార్మసీ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకానాథ్ రెడ్డి ఒక ప్రకటనో తెలిపారు. ఇంటర్ బైపీసీ లేదా ఎంపీసీ ఉత్తీర్ణులైనవారు రెండేళ్ల కాలవ్యవధి కలిగిన ఫార్మసీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులు. ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఈనెల 30న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు. తెల్లరేషన్ కార్డు లేదా ప్రభుత్వ నిబంధనల మేరకు ఇన్‌కం సర్టిఫికెట్ ఉన్నవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. మరిన్ని వివారలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని లేదా కళాశాలలో ఫార్మసీ విభాగంలో లేదా 99088 57585, 99667 61446, 99635 41557 నంబర్లలో సంప్రదించవచ్చు. apsbtet.in/pharmacy లింక్‌ను ఉపయోగించి ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించవచ్చు.

వైసీపీ జెండాలతో తిరుమలకు పాదయాత్ర

● అడ్డుకుని 10మందికి పోలీసుల అనుమతి

చంద్రగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో నిందితుడు ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని తిరుమలకు పాదయాత్రగా వస్తున్న వైసీపీ కార్యకర్తలనుచంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శనివారం వైసీపీ విద్యార్థి సంఘం నాయకుడు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది పీలేరు నుంచి పార్టీ జెండాలతో తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు శ్రీనివాసమంగాపురానకి చేరుకున్నారు. పార్టీ జెండాలతో శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్లకూడదని డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీవారి మెట్టు మార్గంలో ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని 10 మందిని అనుమతిస్తామని చెప్పడంతో వారు అంగీకరించారు. అయితే 10 మంది కాకుండా పోలీసుల కళ్లు గప్పి మరో ఆరుగురు వెళ్లారు. దీంతో టీటీడీ సెక్యూరిటీ, పోలీసులు అప్రమత్తమై ఆ ఆరుగురిని అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.





శ్రీవారిమెట్టు మార్గంలో ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు - వైసీపీ జెండాలతో వాహనం

వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టండి

● విద్యార్థులకు డీఈవో పిలుపు

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని డీఈవో కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్వీ హైస్కూల్లో మంగళవారం జరిగిన ఇన్‌స్పైర్ అవార్డ్స్-2025 నామినేషన్ల ఒకరోజు శిక్షణా తరగతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్లలో మన జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు వేయాలన్నారు. ప్రదర్శనాంశాలు వినూత్నంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ శివ శంకరయ్య, ఏఎస్ఓ సారథి, ఎస్వీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సంధ్య, డీవైఈవో ఇందిరాదేవి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, రిసోర్స్ పర్సన్లు నీలకంఠ, మేమనాథ్, హరిశంకర్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

- ఆ భూమి విషయంలో ఏ చర్యలు తీసుకున్నా

చట్టనిబంధనల ప్రకారం నడుచుకోండి

● భూమన కుటుంబ సభ్యుల భూఆక్రమణ విషయంలో రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశం

● తహసీల్దారు ఇచ్చిన నోటీసు రద్దు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పరిధిలో వైసీపీనేత భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు 9.33 ఎకరాల నదీ పోరంబోకు ఆక్రమణ వ్యవహారంలో ఏ చర్యలు తీసుకున్నా చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తహసీల్దారు ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంటూ దానిని రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పరిధిలోని సర్వేనెం. 479లోని 9.33 ఎకరాల నదీ పోరంబోకు భూమిని ఆక్రమించారని, అందులోని నిర్మాణాలను తొలగించాలని తిరుపతి గ్రామీణ మండలం తహశీల్దార్ ఈనెల 11న ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భూమన కరుణాకర్‌రెడ్డి భార్య జంగా రేవతి, కుమారుడు అభినయ్ హైకోర్టును ఆశ్రయించారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఆ భూమిని 2001-02లో కొనుగోలు చేశారన్నారు. తహశీల్దార్ ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. సంబంధిత భూమి నదీ పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలను నోటీసుకు జత చేయలేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు భూమిని ఆక్రమించారనేందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. నిబంధనలకు అనుగుణంగానే నోటీసులు జారీ చేశామన్నారు.

శేషాచలంపై ఐఐటీతో కలిసి పరిశోధనలు

● డిజిటల్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తామన్న డీఎఫ్‌వో వివేక్

మంగళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'శేషాచల కొండలు అరుదైన జంతు, వృక్ష, కీటకాలకు నిలయం. ఇక్కడి పక్షులు, సీతాకోకచిలుకలపై ఐఐటీతో కలిసి పరిశోధనలు చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మరో వైపు ఇక్కడి జంతువులు, పక్షులు, కీటకాల ఫొటోలు, వాటి వివరాలను డిజిటలైజ్ చేసి భద్రపరుస్తాం' అని తిరుపతి డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. తిరుపతి నగరం కపిలతీర్థం వద్దనున్న తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా దేవాంగ పిల్లి అంతరించిపోయే దశకు చేరుకుందన్నారు. దీని పరిరక్షణకు, సంతతి పెంపుదలకు ప్రభుత్వం, అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేవాంగ పిల్లికి సంబంధించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. శేషాచల అభయారణ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీని అభివృద్ధికి వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'తిరుమలలో నీటి వనరులు, ఆహారం సమృద్ధిగా లభించడం, దట్టమైన అడవులు ఉండటంతో ఏనుగులు గుంపులుగా తిరుగుతూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. రానున్న ఆరేళ్లలో ఏనుగల సంతతి భారీగా పెరగనుంది. అడవి జంతువులకు, మనుషులకు మధ్య ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టడంపై దృష్టి సారిస్తున్నాం' అని డీఎఫ్‌వో వివరించారు.

అందుకే చిరుతలు వచ్చేది

'ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతంలో లభించే ఆహార వ్యర్థాల కోసం శునకాలు వస్తున్నాయి. వాటి కోసం చిరుతలు అటవీప్రాంతం నుంచి ఇటు వస్తున్నాయి. ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో, జూపార్కు రోడ్డులో ప్రజలు ఆహార వ్యర్థాలు వేయకుండా.. వేసినా వెంటనే తొలగించేలా కార్పొరేషన్, టీటీడీ అధికారులతో సంప్రదించాం. ఇలా ఆహార వ్యర్థాలు లేకుండా చేస్తే శునకాలు.. చిరుతలూ రావడం ఆగిపోతాయి. ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో తిరిగే శునకాలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించాలని నగరపాలక అధికారులకు లేఖ రాశాం. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి జూపార్కు రోడ్డులో ఫుడ్ కోర్టులు, వర్సిటీలో హాస్టల్ పరిసరాలను తనిఖీ చేశారు' అని డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. ఆ సమయంలోనే కొందరు యూట్యూబర్లు అవగాహన లోపంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పోస్టులు పెట్టారన్నారు. ఇలా పోస్టులు పెడుతున్న వారిని పిలిపించి అవగాహన కల్పిస్తామన్నారు.

419 దేవాంగ పిల్లులు

శేషాచల కొండల్లోని శ్రీ వేంకటేశ్వర అభయారణ్యంలో స్లెండర్ లోరీస్ (దేవాంగ పిల్లులు)పై అటవీశాఖ సమగ్ర గణన పూర్తి చేసింది. ఈ సర్వే ప్రకారం 419 దేవాంగ పిల్లులు ఉన్నట్లు అంచనా వేశారు రాత్రి పూట జీవించే ఈ చరజీవి ముఖ్యమైన నివాస ప్రాంతాలను గుర్తించారు. ఈ సర్వే పూర్తి వివరాలను ప్రజలకు అందించేందుకు సిద్ధం చేసిన స్లెండర్ లోరీస్ హ్యాండ్ బుక్‌ను మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సర్వే ద్వారా దేవాంగ పిల్లి నివాస ప్రాంతాలు, సంరక్షణ, ప్రజలలో అవగాహన పెంపు వంటి కార్యక్రమాలతో ఈ అరుదైన జాతి సంరక్షణకు అటవీశాఖ కృషి చేస్తోంది.



దేవాంగపిల్లికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో వివేక్

తిరుపతిలో స్పిరిచ్యువల్ స్ట్రీట్

● ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా వీధి ఏర్పాటు ఆలోచనలో కార్పొరేషన్

● ఇస్కాన్, అలిపిరి, కపిలతీర్థం రోడ్లలో ఒకటి ఎంపికచేసే అవకాశం


తిరుపతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):ప్రసిద్ధ ఆలయాలకు నాలుగు వైపులా ఉండే రోడ్లను మాడవీధులు అంటారు. వీటిని పవిత్రమైన ప్రదేశాలుగా భావిస్తారు. ఆలయాల క్షేత్రమైన తిరుపతి నగరం మొత్తం పవిత్రమైనదే! అందుకే తిరుపతి నగరంలో స్పిరిచ్యువల్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేసే దిశగా నగర పాలకసంస్థ అధికారులు ఆలోచిస్తున్నారు. దాదాపు లక్ష మంది దాకా రోజూ తిరుపతి నగరంలోకి వస్తుంటారు. వీరు ఈ రోడ్డులోకి అడుగు పెట్టగానే ఒక ఆధ్యాత్మిక దివ్యానుభూతికి లోనయ్యేలా ఉండాలన్నది ఉద్దేశ్యం. పర్యాటకంగానూ ఇది లాభదాయకంగా ఉంటుందని భావిస్తున్నారు. కమిషనర్ మౌర్య ఈ ఆలోచనకు ఆచరణ రూపం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌ను నగరంలో ఎక్కడ ఏర్పాటు చేయాలన్న చర్చ నడిచినట్లు తెలిసింది. గాంధీరోడ్డు, గోవిందరాజుల ఆలయ ప్రాంతం, బస్టాండు, రైల్వేస్టేషన్ వంటి చోట్ల ఇటువంటి ఏర్పాటు సాధ్యం కాదని అనుకుంటున్నారు. తిరుమలకు వెళ్లే యాత్రికులకు కూడా ఉపయోగపడేలా ఉండాలన్నది ఆలోచన. ఇందుకోసం ఇస్కాన్‌రోడ్డు, కపిలతీర్థం, అలిపిరి ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

డివైన్ వాక్ : స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లోకి ప్రవేశించగానే మనసుకు ప్రశాంతత చేకూరాలి. ఆధ్యాత్మిక అనుభూతి కలగాలి. ట్రాఫిక్ గందరగోళం, హారన్లు, అరుపులు ఉండవు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లో వేదమంత్రాలు, భజనలు, కీర్తనలు, నాదస్వరం మంద్రస్వరంలో వినిపిస్తాయి. సంప్రదాయ దేవాలయ శైలిలోనే లైటింగ్ కూడా ఉంటుంది. దుకాణాలు కూడా ఇదే పద్ధతిలో ఉంటాయి. ఈ వీధిలో ఏవి పడితే అవి విక్రయించరు. తులసి మాలలు, ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులు ఉంటాయి. భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతా మూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి లభిస్తాయి. టీటీడీ సౌజన్యంతో వారంలో ఒకరోజు, లేదా ప్రతినిత్యం తిరుమల సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లో వాహనాలను అనుమతించరు. కేవలం నడక మాత్రమే ఉంటుంది. నడవలేని స్థితిలో ఉండేవారి కోసం బ్యాటరీ వాహనాలుంటాయి. స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఎంపికలో ఇదే పెద్ద సవాలుగా మారుతుంది. వాహనాలను అనుమతి లేదంటే ఆ ప్రాంతపు ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధుల సహకారంతో దీనిని సాకారం చేసుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

వైసీపీది రోత రాజకీయం: టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు రోత రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ మండిపడ్డారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ అంటేనే అరాచకాలకు, అవినీతికి, అసత్య ప్రచారాలకు మారుపేరని చెప్పారు. వైసీపీ నేతలు తమ సామాజిక మాధ్యమాలు, సొంత మీడియా, అనుబంధ టీవీ చానళ్ల ద్వారా మతాలు, కులాల మధ్య వైషమ్యాలు పెంచడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వర్షాలు కురుస్తుండటంతో రాజధాని అమరావతి మునిగిపోయిందని, ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ హిట్ కావడంతో జగన్, వైసీపీ నేతలు జీర్ణించుకోలేక ఫేక్ ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.


సురేంద్రకుమార్



నేడు దోమల నివారణ దినం

చిత్తూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం ఆవిష్కరించారు. బుధవారం దోమల నివారణ దినం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఎంవో వేణుగోపాల్ సూచించారు.

సర్పాల సయ్యాట..!

సోమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సోమల జయంతి ప్రాథమిక పాఠశాల సమీపంలోని పొలం వద్ద రెండు పాములు పెనవేసుకొని సయ్యాటలాడటం రైతులు గుర్తించి తిలకించారు. సుమారు గంటపాటు ఆ మార్గంలో రైతులు పొలాల వైపు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.


బయటపడిన అనాటి రుబ్బురోలు పత్రం - ఆరోజుల్లో వాడే సన్నికాటిరాయి రుబ్బురోలు - రైతులు దుక్కిదున్నడంతో పొలంలో బయటపడిన పురాతన ప్రతిష్ఠ కుండల పెంకులు

చిట్టేడు పొలిమేరల్లో పురాతన చారిత్రక ఆనవాళ్లు

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడు గ్రామ పొలిమేరల్లో రెండవసారి మంగళవారం కొన్ని పురాతన చారిత్రక ఆనవాళ్లు బయటపడ్డాయి. గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో ఒక బృందం ఈ చారిత్రక ఆనవాళ్లను పరిశీలించారు. గత రెండు రోజులుగా చిట్టేడు గ్రామదేవత చిట్టేటమ్మ దేవాలయ సమీపంలోని పొలాల్లో రైతులు వరి ఎల్లి దుక్కిలు దున్నుతుండగా 15వ శతాబ్దంలోని చిట్టేడు గ్రామపాలేదారులకు సంబంధించిన అనేక ఆధారాలు బయటపడ్డాయి. అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు వాడిన మట్టిపాత్రలు, రాతి పనిముట్లు, రుబ్బురోలు, మట్టికుండల పెంకులు బయటపడినట్లు గోవిందు సురేష్ తెలిపారు. అలాగే అనాటి పాలేగార్ల ఆరాధ్య దైవం పురాతన వినాయకుడి రాతి విగ్రహం కూడా బయటపడింది. మత సంబంధమైన ఆచారాలను తెలిపే కొన్ని వస్తువులు కూడా బయటపడినట్లు గోవిందు సురేష్ తెలిపారు. రెండవసారి అధ్యయనంలో మరిన్ని వివరాలు, ఆనవాళ్లు దొరికితే పురావస్తుశాస్త్ర శాఖకు అప్పగిస్తామన్నారు.


చిట్టేడు పొలిమేరలో 17వ శతాబ్దంనాటి వినాయకుడు విగ్రహం

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యమెందుకు?

రెవెన్యూ సిబ్బందిపై ఆర్డీవో మండిపాటు


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

యాదమరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యమెందుకని రెవెన్యూ సిబ్బందిపై ఆర్డీవో శ్రీనివాసులు మండిపడ్డారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. భూవివాదాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన కొందరు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఎందుకు వర్తింపచేయలేదని ఏవో దీపను ప్రశ్నించారు. అలాగే ఓ రైతు బతికుండగానే చనిపోయినట్లు పోర్టల్‌లో నమోదవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ పార్థసారథి, డీటీ జయంతి, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వర్షాలకు 'వరి' నష్టపోకుండా చూసుకోండి


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుడిపాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ రామకృష్ణరావు సూచించారు. మంగళవారం గుడిపాల మండలంలోని గుర్రాలమిట్ట, కొత్తపల్లె గ్రామాల్లో వరి, వేరుశనగ, చెరకు సాగు చేస్తున్న పొలాలను సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటను పరిశీలించారు. నష్టాన్ని లెక్కించారు. డాక్టర్ సరళ, వజంత, నాగమణి, హారతి, చిత్తూరు ఏవో మాధవి, మండల వ్యవసాయ అధికారి సంగీత పాల్గొన్నారు.

వాణిజ్య పన్నులశాఖ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

చిత్తూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన సంఘ సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా దశరథన్, ఉపాధ్యక్షులుగా సరేష్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, కార్యాలయ కార్యదర్శిగా పురుషోత్తం నాయుడు, సహాయ కార్యదర్శులుగా రెడ్డిప్రసాద్, జోష్న, కోశాధికారిగా జ్ఞానవేల్ ఎన్నుకున్నారు. అతిథిగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగేశాడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి పురుగుల మందును తాగేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని ఈచనేరిపల్లెకి చెందిన సురేంద్ర(37) సోమవారం మద్యం తాగి గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటలో దిన్నెపై కూర్చొన్నాడు. కొంతసేపటికి తన పక్కనే ఉన్న పురుగుల మందు డబ్బాను మందు బాటిల్ అనుకుని తాగేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబీకులు గమనించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



పలమనేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుండుబావిలో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పలమనేరు సమీపంలో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం మేరకు... పలమనేరు లింగాయతి వీధికి చెందిన గౌతమ్(28) మంగళవారం ఉదయం పలమనేరు- మదనపల్లి రహదారి పక్కనే ఉన్న గుండుబావిలో మృతిచెంది ఉంటడం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.మృతికి గల కారణాలు అనుమానాస్పదంగా ఉందని..పోస్టుమార్టం రిపోర్టులో పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ యాప్‌లో పేరు ఎక్కితే పెన్షను రాదు జాగ్రత్త..!

అధికారులకు రేణిగుంట ఎంపీపీ హెచ్చరిక

రేణిగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ త్వరలో తీసుకొచ్చే యాప్‌లో అధికారుల పేర్లు ఎక్కితే రటైరయినా పింఛను రాదని వైసీపీకి చెందిన ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించక పోవడంపై ఆయన స్పందిస్తూ ప్రభు త్వాలు వస్తుంటాయి పోతుంటాయని అభివృద్ధి జరగాలి అంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో త్వరలో వైసీపీ తీసుకొచ్చే యాప్‌లో అధికారుల పేర్లు నమోదైతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ కూడా రాదని హెచ్చరించారు.

కర్ణాటక స్మగ్లర్ అరెస్టు

● ఎర్రచందనం దుంగలు సహా రెండు కార్లు స్వాధీనం



మంగళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కరకంబాడి-మామండూరు మార్గంలో ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలు, రెండుకాదర్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కమార్ బృందం సోమవారం రాత్రి నుంచి కరకంబాడీ-మామండూరు మార్గంలోని ఆంజనేయపురంచెక్‌పోస్టు వద్ద రెండు కార్లు వేగంగా వస్తుండటాన్ని గమనించిన టాస్క్‌ఫోర్సు పోలీసులు వాటిని ఆపే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించిన ఒక వాహనంలోని డ్రైవ్ కారుపక్కకు ఆపి పారిపోగా మరో కారులోని వ్యక్తిని పట్టుకున్నారు. వాహనాలు తనిఖీచేయగా వాటిలో 20 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడ్డ స్మగ్లర్ కర్ణాటక రాష్ట్రానికిచెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టుబడ్డ స్మగ్లర్‌ను, వాహనంతో సహా ఎర్రచందనం దంఉగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంత్రాక్స్ నిర్మూలనకు గ్లోబల్‌స్థాయి చర్యలు అవశ్యం



జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ కుమణన్, డాక్టర్ రాణీప్రమీల

తిరుపతి రూరల్,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ లేబొరేటరీ, బయోటెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆంత్రాక్స్ వ్యాధి నిర్మూలన-సవాళ్లపై రెండురోజుల జాతీయసదస్సు మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా ప్రత్యేక నిపుణులు ఎక్స్‌పర్ట్ డాక్టర్ కె.కుమణన్(తమిళనాడు),డాక్టర్ నరేష్‌జిందాల్(హరియాణా)లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆంత్రాక్స్ జూనోటిక్ కావడంతో జంతువులు, మనుషులతోపాటు వాతావరణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాధి నియంత్రణకు గ్రామస్థాయి నుంచి గ్లోబల్ స్థాయి వరకూ చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా జంతువులకు వ్యాక్సినేషన్ వేయాలన్నారు. వ్యాధితో మృతిచెందిన జంతువుల కళేబారాలను సరైన పద్ధతిలో ఖననం చేయాలన్నారు. శాస్త్రీయంగా క్రిమిసంహారక మందులు వాడాలన్నారు. వర్సిటీ డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, డీఈ ప్రొఫెసర్ శోభామణి, సీవోఈ ప్రొఫెసర్ చెంగల్వరాయులు, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రాణీప్రమీల,తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వీకే సారస్వత్ నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు ప్రతిష్టాత్మక పురస్కారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ప్రతిష్టాత్మక పురస్కారాన్ని పొందారు. రేర్ ఎర్త్స్‌కు సంబంధించి బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో దేవప్రసాదరాజు విశేష కృషిచేశారు. ఇందుకు గుర్తింపుగా రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ పురస్కారాన్ని అందజేసింది. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్ చేతుల మీదుగా ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రేర్ ఎర్త్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, వర్సిటీ మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సీకే జయశంకర్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి తదితరులు దేవప్రసాద్‌రాజును అభినందించారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

● విచ్చలవిడిగా విక్రయాలు ● పట్టించుకోని రెవెన్యూ అధికారులు

పెద్దపంజాణి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల కేంద్రంలో కోట్ల రూపాయల విలువైన పాఠశాల, ప్రభుత్వ భూములు కబ్జా చేసి యథేచ్ఛగా విక్రయాలు చేపడుతున్నారు. తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ భూములు, పాఠశాల భూములు కబ్జాకు గురవుతున్నా.. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి ఇంటి స్థలాల కోసం విక్రయించేశాడు. ఇటీవల పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం సర్వే చేయగా ఆక్రమణ విషయం వెలుగు చూసింది. పాఠశాల స్థలానికి అనుసంధానంగా ప్రభుత్వ భూమి సైతం ఉండటంతో పాఠశాల, ప్రభుత్వ భూమి కలిపి ఇంటి నివాస స్థలాలకు విక్రయాలు చేశాడు. ఇదే స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదేంటని అడిగిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ భూమి తనదంటూ అడ్డు వచ్చిన వారిపై కేసులు పెట్టిస్తానని, కోర్టుల చుట్టూ తిప్పుతానని బెదిరిస్తున్నాడు. పాఠశాల, ప్రభుత్వ భూములకు తప్పుడు రికార్డులు సృష్టించుకుని విక్రయాలు జరిపినట్లు


పాఠశాల స్థలంలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలు

తెలుస్తోంది. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు దాదాపు రెండు వందల మందికి పైగా పాఠశాల, ప్రభుత్వ భూములు కాపాడాలని పది రోజుల క్రితం రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. మండల కేంద్రంలో అత్యంత విలువైన భూములు కబ్జాలకు గురైనా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను ఆక్రమదారుల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం

పాఠశాల, ప్రభుత్వ భూమి కబ్జా విషయం నా దృష్టికి రాలేదు. పెద్దపంజాణి గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆక్రమణపై అర్జీ ఇచ్చిన సమయంలో నేను సెలవులో ఉన్నాను. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటా.

- హనుమంతు, తహసీల్దారు, పెద్దపంజాణి

మొక్కజొన్న మేతతో అధిక పాల దిగుబడి


మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ రెడ్డికుమారి, ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నతో వచ్చే పచ్చి మేతతో పశువులు అధిక పాల దిగుబడి ఇస్తాయని పశుసంవర్ధకశాఖ కుప్పం సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.రెడ్డికుమారి, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ అన్నారు. కుప్పం మండలం గరిగచీనేపల్లె పంచాయతీ రైతు సేవాకేంద్రంలో మంగళవారం వారు రాయితీ మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 కిలోల మొక్కజొన్న విత్తనాల ప్యాకెట్‌ను 75 శాతం రాయితీతో రూ.85 లకు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేలురకం విత్తనాలు ఎకరానికి 20-25 కిలోల వరకు చల్లుకోవచ్చన్నారు. చల్లిన 60 రోజుల తర్వాత కోతకు వచ్చి ఎకరానికి ఇరవై టన్నుల పచ్చి మేత దిగుబడి అవుతుందన్నారు. అధిక పాల దిగుబడికి పశువులకు ఈ మేత ఉపయోగపడుతుందని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ రవికుమార్, పశు సంవర్ధక సహాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలి


అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన రెస్కో చైర్మన్ విశ్వనాథ్

రామకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని డా.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని మంగళవారం రెస్కో చైర్మన్ విశ్వనాథ్ అధికారులతో కలిసి సందర్శించారు. విద్యాలయంలో పలు చోట్ల విద్యుత్ తీగలు వేలాడుతుండటాన్ని గమనించిన ఆయన వాటిని వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆవరణలో చెట్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. వానలు కురుస్తుండటంతో రెస్కో సిబ్బంది తరచూ విద్యాలయాన్ని సందర్శించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ రజనీకుమార్, రెస్కో అధికారులు శంకర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

రామకుప్పం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా విజయ్


విజయ్, జయప్ప, పళని, వేణుగోపాల్

రామకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ), వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) కార్యవర్గ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఇన్‌చార్జి ప్రకాష్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా చింతకుప్పానికి చెందిన విజయ్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా గడ్డూరుకు చెందిన జయప్ప, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా వేణుగోపాల్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, గోవిందప్ప, రాఘవేంద్ర, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో రైతులకు విరివిగా రుణాలు


సోమలలో మాట్లాడుతున్న డీసీసీబీ మేనేజర్ నాగమణి

సోమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీలో రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్నామని... రైతులు సద్వినియోగం చేసుకోవాలని చౌడేపల్లి డీసీసీబీ బ్రాంచి మేనేజర్ నాగమణి అన్నారు. మంగళవారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతు బంధు పథకంతో పాడిపరిశ్రమ, మినీ ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విరివిగా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే వ్యాపార అవసరాలకు రుణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు పి. శివశంకర్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సూపర్‌వైజర్ ఆదిమోహన్‌రెడ్డి, సీఈవో రెడ్డెప్ప, అష్రఫ్‌అలీ, సతీశ్, చాణుక్య, సహకార సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం


ఆర్టీసీ బస్సుకు పూజలు చేస్తున్న మహిళలు

సోమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలందరికీ అండగా నిలుస్తోందని సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మంగళవారం పొదలకుంటపల్లెలో పల్లె వెలుగు బస్సుకు మహిళలు పూజలు చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పొదలకుంటపల్లె, వడ్డిపల్లె, తుగడంవారిపల్లె మహిళలు, సోమల సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, టీడీపీ నాయకులు బాబురావు, చాణుక్య ప్రసాద్ పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన తప్పనిసరి


సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏవో రాధ

పుంగనూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ఓ వజ్రాయుధమని .. ప్రతిఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏవో రాధ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి చట్టంపై అవగాహన కల్పించారు. కార్యాలయానికి సమాచార హక్కు చట్టం దరఖాస్తులు అందితే పూర్తి సమాచారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆర్టీఏ నిబంధనల మేరకు కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో ఇవ్వాలని సూచించారు. అడిగిన సరైన సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

13న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


జడ్జి షేక్ ఆరీఫా

పుంగనూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13వ తేదీన కోర్టు ఆవరణలో జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి షేక్ ఆరీఫా కోరారు. మంగళవారం పుంగనూరులో న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలని, తద్వారా డబ్బులు, సమయం ఆదా అవుతుందన్నారు. న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరించాలని కోరారు.

ఆధార్‌లో పేరు మార్పుపై తండ్రీ బిడ్డల ఘర్షణ

చౌడేపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆధార్‌లో పేరు మార్చుకున్నాడని తండ్రీ కొడుకులు ఘర్షణ పడిన సంఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పెద్దకొండామారికి చెందిన అంజప్ప(58), పార్వతమ్మ(53) దంపతులకు విజయ్(35), అమరమ్మ(40) పిల్లలున్నారు. వీరిద్దరికీ వివాహాలు చేశారు. అయితే అంజప్ప తన భార్య పార్వతమ్మతో మనస్పర్థలతో విడిగా ఉంటున్నారు. ఈక్రమంలో అంజప్ప పదేళ్ల క్రితం కోటూరుకు చెందిన ముస్లిం మహిళ అమ్మజాన్(45)ను వివాహం చేసుకుని కోటూరులో కాపురం ఉంటున్నారు. అంజప్ప తన పేరును ఆధార్ కార్డులో ఆలీషాబ్‌గా మార్చుకున్నాడు. అంజప్ప చౌడేపల్లెలో టైలర్ షాపు నిర్వహిస్తుండగా దుకాణం వద్దకు కుమారుడు, కూతురు వెళ్లి ఆధార్‌లో పేరు మార్చుకోవడంపై ఘర్షణ పడ్డారు. ఘర్షణలో అంజప్పతోపాటు కుమారుడు విజయ్, కూతురు అమరమ్మలు గాయపడ్డారు. పుంగనూరు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు.

26 లోపు బార్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీ లోపు మున్సిపల్ పరిధిలో మద్యం బార్ల నిర్వహణ కోసం ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ సీఐ సురేశ్‌రెడ్డి కోరారు. అప్లికేషన్ ఫీజు రూ.51,000 చెల్లించాలని, లైసెన్స్ ఫీజు మొదటి ఏడాదికి రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 28వ తేదీన చిత్తూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-మదనపల్లె మార్గంలో ఈడిగపల్లె వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బల్లసముద్రం గ్రామానికి చెందిన గోపి(24), శివ(18) ఈడిగపల్లె సమీపంలోని ఆదిత్య కాలేజీలో అడ్మిషన్ కోసం ద్విచక్రవాహనంలో వెళుతుండగా కారు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం


డాగ్యురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పుంగనూరు ఫొటోగ్రాఫర్లు

పుంగనూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ల సృజనాత్మకతను గుర్తించాల్సిన అవసరముందని ఆ సంఘ ఉపాధ్యక్షుడు అశోక్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఓ స్టూడియోలో ఫొటోగ్రఫీ పితామహుడు డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాముఖ్యతనిచ్చేవారని, ప్రస్తుతం సెల్‌ఫోన్లు రావడంతో ఫొటోగ్రఫీ ఉనికి తగ్గిపోతోందన్నారు. ప్రజలు ఫొటోగ్రఫీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఉదయ్‌కుమార్, కేశవ, నవీన్, బోస్, హరి, శేఖర్, విగ్నేష్, బాల నరేష్, వినీత్, ముని, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రామాలయ కుంభాభిషేకం

చౌడేపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీర్జేపల్లె రామాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. మంగళవారం మండలంలోని చారాల పంచాయతీ బీర్జేపల్లె రామాలయంలో వేదపండితులు ఆలయ కలశ స్థాపన నిర్వహించి కుంభాభిషేకం చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

తల్లీబిడ్డల సమాచారం ఇవ్వండి


బిడ్డతో ఉన్న చంద్రలేఖ, పది నెలల బాబు

కుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం జరుగు గ్రామానికి చెందిన చంద్రలేఖ (28), మూడు సంవత్సరాల పది నెలల కొడుకుతో సహా కనిపించడం లేదని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు. మూడు రోజుల క్రితం బిడ్డతో సహా బయటకు వెళ్లిన చంద్రలేఖ తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వారి ఆచూకీ తెలిసినవారు ఫోన్ నంబర్లు 94409 00733, 80749277671చ 9000390519 లను సంప్రదించాలని సీఐ కోరారు.

మంత్రి నారాయణను కలిసిన సురేష్‌బాబు


మంత్రి నారాయణను సత్కరిస్తున్న సురేష్‌బాబు తదితరులు

వి.కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర మానవవనరుల సంస్థ చైర్మన్ రాజశేఖర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ

రామకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో బుధవారం ఉదయం 11 గంటలకు అన్న క్యాంటీన్ భవనానికి భూమిపూజ చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. నేతలు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్‌రెడ్డి

వి.కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో ప్రశాంత వాతావరణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని.. ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ కోరారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సీఐ సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో వి.కోట పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షులు రంగనాథ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఇక్కడ అన్ని వర్గాలు ఐక్యంగా ఉంటున్నారని.. ఇదే వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు. రానున్న వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం ఏర్పాట్లపై చర్చించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో పోస్టులు పెట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. అసభ్యకరంగా, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరన్, ఎస్సై జావేద్‌బాషా, వైస్ ఎంపీపీ డా.తమీంఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, గ్రామపెద్దలు సుబ్బన్న, దీరజ్, బాలగురునాథ్, విజయ్, రామచంద్రుడు, శివరాయల్, మసీదు ముత్తవలీలు అబ్దుల్ సలాం, లతీఫ్‌సాహెబ్, లతీఫ్, హెసానుల్లా, రుహుల్లా, నవాజ్, అఖీల్ అహమ్మద్, షేక్‌ఉమ్మర్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం'


సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ రఘునాథరెడ్డి

రొంపిచెర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని రైతుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని నూతనంగా ఎన్నికైన సింగిల్‌విండో చైర్మన్ రఘునాథరెడ్డి, సభ్యులు శివారెడ్డి, సూరిశెట్టి సురేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ రాష్ట్ర ప్రజలు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చైర్మన్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కంటే మిన్నగా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇవ్వడానికి పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, అధికారుల సహకారం తీసుకుంటామన్నారు. చిత్తూరు డీసీసీ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ రైతులకు అందించే రుణాలు, చెల్లింపులపై వివరించారు. సూపర్‌వైజర్ శ్రావణి, ఎర్రమరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రేపు ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులతో గ్రామసభలు

రామకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం భూనిర్వాసిత రైతులతో గురువారం కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు కొలేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు అంకిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో, 11 గంటలకు కిలాకిపోడు అంగన్‌వాడీకేంద్రంలో, మధ్యాహ్నం 12 గంటలకు కడిసినకుప్పంలోని దుర్గమ్మగుడి వద్ద, 2 గంటలకు బొందలగుంట వీరనాగపురం కమ్యూనిటీ హాల్‌లో, 3 గంటలకు మణీంద్రం సచివాలయంలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు. గ్రామసభలకు రైతులు, ప్రజాప్రతినిధులు, వీఆర్వోలు, సర్వేయర్లు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

సుబ్రహ్మణ్యస్వామికి కావళ్లు


వీపునకు కొక్కేలు తగిలించుకొని వేల్‌కావడిని లాగుతున్న భక్తుడు

వి.కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యస్వామికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కావళ్లను మోస్తున్నారు. అయితే మంగళవారం వి.కోట పట్టణం బస్సాపురానికి చెందిన భక్తుడు మురళీ తన వీపునకు కొక్కీలను వేసుకుని, శూలాన్ని ముందు ఉంచుకుని స్వామి వారి రథాన్ని లాగి తన భక్తిని చాటుకున్నాడు. బస్సాపురంలోని అమ్మవారి ఆలయం వద్ద సుబ్రహ్మణ్యస్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై గ్రామస్తులు కొలువుదీర్చారు. కాలనీలోని అమ్మవారి ఆలయం వద్ద నుంచి పట్టణ పురవీధుల మీదుగా రథోత్సవాన్ని లాగుతూ వెళ్లారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

మెరుగైన వసతులతో విద్యార్థులకు బోధన


రొంపిచెర్ల మోడల్ స్కూల్ ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి

రొంపిచెర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య, క్రీడలు, భోజన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, భోజనం, విద్యాబోధనలపై ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్ బహ్మానందరెడ్డికి సూచించారు. అనంతరం పాఠశాలకు అవసరమైన పిల్లల ఆటస్థలం కోసం స్థలాన్ని పరిశీలించారు. మోడల్ స్కూల్ సమీపంలోనే జాతీయ రహదారి ఉన్నందున రోడ్డు దాటి ఆట స్థలానికి వెళ్లేందుకు పిల్లలు ఇబ్బంది పడుతారని, రోడ్డు మార్గం దాటకుండా ఉండేలా ఆటస్థలం ఎంపిక చేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రమణతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు.కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు


కవల పేయ దూడలు

రామకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చింతకుప్పం గ్రామంలో శివాజీ అనే రైతుకు చెందిన ఆవు మంగళవారం సాయంత్రం రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండు పేయ దూడలు కావడంతో శివాజీ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. చూడముచ్చటగా ఉన్న దూడలను చూసి గ్రామస్తులు మురిసిపోయారు.

గార్గేయనదిపై వంతెనల నిర్మాణం జరిగేనా?

సోమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీపంలో ప్రవహిస్తున్న గార్గేయ నదీ తీరం అవతల గ్రామాల ప్రజలు తీరం దాటేందుకు పలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గార్గేయ నది దుర్గంకొండలో ఆవిర్భవించి పెద్దఉప్పరపల్లె, పత్రపల్లె, నంజంపేట, పొదలకుంటపల్లె మార్గంలో ప్రవహించి సదుం, పీలేరు మార్గంలోని బాహుదానదిలో కలుస్తుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం బోనమంద మార్గంలో చిన్నకమ్మపల్లె వద్ద గార్గేయ నదిపై వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసింది. అలాగే రెడ్డివారిపల్లె మార్గంలో వంతెన నిర్మాణానికి గోతులు తీసి వదిలేశారు. రెడ్డివారిపల్లె విద్యార్థులు, ప్రజలు పెద్దఉప్పరపల్లెకు వివిధ పనులకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో ఈమార్గంలో ప్రయాణాలు గగనంగా మారాయి. వర్షాకాలంలో గార్గేయనది ప్రవాహ వేగంతో రెడ్డివారిపల్లెవాసులు పత్రపల్లె, కొత్తూరు మార్గంలో 3 కిలోమీటర్లు నడక మార్గంలో గ్రామానికి చేరుకోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అలాగే చౌడేపల్లె - పెద్దఉప్పరపల్లె మార్గంలో కల్వర్టులు లేకపోవడంతో గతకొంత కాలంగా ప్రయాణాలు ఆగిపోయాయి. ప్రజలు నిత్యావసర


రెడ్డివారిపల్లె మార్గంలో గార్గేయ నది వద్ద అడ్డుగా వేసిన ముళ్లకంపలు

వస్తువుల కొనుగోలుకు, వైద్యసేవలకు పెద్దఉప్పరపల్లెకు రాలేకపోతున్నారు.ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు రైతులు పండించిన పంటలను పుంగనూరు, పలమనేరు మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు.అధికారులు స్పందించి గార్గేయ నదిపై వంతెనలు నిర్మించి ప్రయాణాలు సాగేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'స్త్రీ శక్తి'తో సంతోషంగా మహిళలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'స్త్రీ శక్తి పథకం'తో మహిళలు సంతోషంగా ఉన్నారని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చుడా చైర్పర్సన్ కటారి హేమలత మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ హిట్ అయ్యాయన్నారు. మహిళలకు సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు బస్ పాస్‌లకోసం ఇబ్బందిపడే పనిలేదన్నారు. మహిళా రైతులు తమ పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోవచ్చని వివరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలకంటే ఎక్కువగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు.

ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న రవికుమార్

పెనుమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చిప్పారపల్లె పంచాయతీ పాళ్యంయానాది కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం కాలనీలో ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే సీహెచ్‌సీ తనిఖీ చేశారు. ఎంపీడీవో కిషోర్, మాజీ జడ్పీటీసీ రుద్రయ్యానాయుడు, తలారి రెడ్డెప్ప, ఏఈ రమేష్‌బాబు, సెక్రటరీ జ్యోతీశ్వర్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


రామచంద్రమోహన్‌కు వరసిద్ధుడి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో ధనంజయ

ఐరాల (కాణిపాకం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంత్రులను ఎమ్మెల్యే మురళీమోహన్ ఆహ్వానించారు. విజయవాడలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డిలను, గొల్లపూడిలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌ను ఆలయ సిబ్బంది, వేదపండితులతో కలిసి ఆహ్వాన పత్రికలను అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, మాజీ చైర్మన్ మణినాయయుడు, ఏఈవో ధనంజయ, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో ప్రసంగిస్తున్న హేమచంద్రనాయుడు

బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ హేమచంద్రనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం సింగిల్‌విండో కార్యాలయంలో ఖాతాదారులు, రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాజశ్రీహర్ష ఖాతాదారులకు పలు సేవలను వివరించారు. సింగిల్‌విండో డైరెక్టర్లు హరిప్రసాద్, దేవయాని, సీఈవో రామ్మూర్తి పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో పతకాలు



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అబాకస్ గణిత మేధ పోటీల్లో కొంగారెడ్డిపల్లిలోని యూసీమాస్ సంస్థ విద్యార్థులు పలు పతకాలు సాధించారని నిర్వాహకులు భార్గవి, ఉమ తెలిపారు. ఈనెల 17వ తేదీన హైదరాబాదులో నిర్వహించిన పోటీల్లో ప్రణతి, సయ్యద్ అయాన్ అలీ, శ్రీసహస్రలు స్వర్ణ పతకాలు, కుందనశ్రీ, పఠాన్, రెడ్డిదీక్షిత్, యుక్తశ్రీ రజత పతకాలు, విష్ణుమూర్తి కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను మంగళవారం అభినందించారు.

వ్యాధి నిరోధక టీకాలతో ప్రాణాంతక వ్యాధులకు చెక్


వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా 13 ప్రాణాంతక వ్యాధులకు చెక్ పెట్టొచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహణపై పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ షైనిక స్టెపి తామస్ మాట్లాడుతూ.. వ్యాక్సిన్ బిడ్డకు అందేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రజలు ప్రశాంతంగా ఉండటమే లక్ష్యం: సీఐ

వెదురుకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రశాంతంగా ఉండటమే లక్ష్యమని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పచ్చికాపల్లం ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై పలు సూచనలిచ్చారు.

అర్హులైన రైతులకు న్యాయం చేస్తాం

గుడిపాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసి, న్యాయం చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో పథకానికి అర్హులను గుర్తించారు. పాసుబుక్కుల్లో తప్పులు, ఇతర సమస్యలను వీఆర్వో సరిదిద్దారని తహసీల్దార్ చెప్పారు.

'గోకులం షెడ్డు' బిల్లులెప్పుడిస్తారు?


ఎం.అగరంలో పూర్తయిన షెడ్డు

విజయపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోకులం షెడ్డు నిర్మాణాలు జరిగి ఏడాది అవుతున్నా బిల్లులు రాలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 52 షెడ్ల నిర్మాణం జరిగితే అంచెలవారీగా బకాయిలు ఉన్నాయని, ఈ విషయమై అధికారులు స్పందించడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

శభాష్ — రోడ్డుపై గుంతలను సొంత ఖర్చుతో పూడ్చిన యువత



బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాగిమానుపెంట రోడ్డు ధ్వంసమైంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మలుపు వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనివల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే 20 గ్రామాల వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీన్ని ఇందిరమ్మ కాలనీకి చెందిన యువకులు గమనించారు. అందరూ కలిసి తమ సొంత ఖర్చుతో కాలనీ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను మంగళవారం పూడ్చారు. వీరిని స్థానికులు అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి భారతి

బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంఎస్ భారతి అన్నారు. మంగళవారం కాటప్పగారిపల్లె గ్రామంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయరాదని, మహిళలకు కోర్టులో ఏవైనా కేసులుంటే ఉచితంగా కేసు వాదించడానికి వకీల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. బాల్య వివాహాలపై అధికారులకు తెలియజేయాలన్నారు. అంతకుముందు అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ట్రైనీ ఎస్ఐ అశోక్‌కుమార్, మాజీ సర్పంచు హరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయాధికారులు - సేనాధిపతి తిరువీధి ఉత్సవం

వెదురుకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకర్యాలు జరిగాయి. సాయంత్రం ఆరు నుంచి మేదినీ పూజ, మృత్సంగ్రహణం, సేనాధిపతి తిరువీధి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవో రవికుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు సురేష్‌బాబు, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా బుధవారం ఉదయం మూలవర్లకు తిరుమంజనం, పవిత్రాల సమర్పణ ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు తిరువీధి ఉత్సవం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఆలయాధికారులు తెలిపారు.

సంక్షిప్తంగా..

తాగునీటి సమస్య పరిష్కారం

నింద్ర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆరూరు పంచాయతీ పాతారూరులో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరించారని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఆనందరాజు తెలిపారు. సుమారు రూ.2.7లక్షల జడ్పీ నిధులతో పైపులైన్ ఏర్పాటు చేయించారని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారని వివరించారు.

పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు

నగరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బయోమెట్రిక్ అప్డేట్ కోసం పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శ్రీదేవి తెలిపారు. పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన ఆధార్ క్యాంపును ఆమె మంగళవారం పరిశీలించారు. డిజిటల్ అసిస్టెంట్ రాజకుమారి పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో ఫొటోగ్రఫీ దినోత్సవం

చిత్తూరు సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కేక్ కట్‌చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బంగారమ్మకు పూజలు



వెదురుకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామదేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

మాస మహిళా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మాస మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సత్యసాయి బాబాకు పూజలు చేశారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ప్రసూతి వార్డులో బాలింతలకు, గర్భిణులకు బేబీ కేర్ కిట్స్, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం సంస్థాన్‌లో త్రయంబక, రుద్ర పారాయణాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో రుక్మిణి, రత్న, శివప్రకాష్, శేష నారాయణ, దేవరాజులు, గజేంద్ర రెడ్డి, కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

పట్టాదార్ పాసుపుస్తకానికి ఆధార్ అనుసంధానం చేసుకోండి: ఆర్డీవో


సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో భవాని

బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పట్టాదార్ పాసుపుస్తకానికి ఆధార్ తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని పలమనేరు ఆర్డీవో భవాని తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. అన్నదాత సుఖీభవ పథకం నగదు జమకాని రైతులు స్థానిక వ్యవసాయాధికారి భారతిని కలిసి సరైన ఆధారాలతో సమర్పించాలని సూచించారు. ప్రతి ఖాతాకు మొబైల్ నెంబరును అనుసంధానం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

నింద్ర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలంలో జరిగిన రెండో విడత భూ రీసర్వే పనులను నగరి డివిజనల్ సర్వేయర్ ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులుంటే 21 రోజుల్లోపు సంబంధిత రీసర్వే అధికారికి అప్పీల్ చేసుకోవాలని సంబంధిత రైతులకు నోటీసులు ఇచ్చామన్నారు. రీసర్వే డీటీ నీలావతి, మండల సర్వేయర్ వెంకటేష్, సచివాలయ సర్వేయర్లు అరుణ్, ఉష, దినేష్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సమావేశంలో ప్రసంగిస్తున్న గీత

శ్రీరంగరాజపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై పిళ్లారికుప్పం రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ శాఖ అడిషినల్ డైరెక్టర్ గీత మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికీ ఉన్న శక్తివంతమైన ఆయుధం అన్నారు. సిరికల్చర్ అధికారులు గణష్, వెంకటలక్ష్మమ్మ, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగర ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. నగర అధ్యక్షుడిగా గణేశ్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఓం ప్రకాష్, దొరై, కోశాధికారిగా లోక్‌నాథ్, సెక్రటరీగా శంకర్, సంయుక్త కార్యదర్శులుగా ఢిల్లిరాజు, శివశక్తి, కన్వీనర్లుగా హరిబాబు, రామకృష్ణ, కోటేశ్వర్‌రెడ్డి, పవన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా హరి, దేవా, అడ్వైజింగ్ కమిటీ సభ్యులుగా రవి, నాగరాజ్, దేవి వరప్రసాద్, అరుణ్, ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పిస్తోందని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడులోని ఓబీసీ వర్గానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయడం దీనికి నిదర్శమని చెప్పారు.

రుణం పొందడంపై రైతులకు అవగాహన

పాలసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో ద్వారా రుణం పొందడంపై రైతులకు మంగళవారం డీసీసీబీ మేనేజర్ గోమతి అవగాహన కల్పించారు. మంగళవారం పాలసముద్రం సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలను తక్కువ వడ్డీకే ఇస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ మహబూబీ, సీఈవో వెంకటముని, సిబ్బంది పాల్గొన్నారు.

44 మంది మందుబాబులకు జరిమానా

చిత్తూరు అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మందుబాబులు 44 మందికి జరిమానా విధించారు. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. రెండ్రోజులు నిర్వహించిన వాహనాల తనిఖీలో ఆరుగురు మద్యం తాగి నడుపుతుండటంతో కేసు నమోదు చేశారు. ముగ్గురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతుండగా పట్టుకున్నారు. వీరిని మంగళవారం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి మద్యం తాగి వాహనాలను నడిపిన ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున జరిమానా విధించారని సీఐ తెలిపారు.

● అలాగే ట్రాఫిక్ పోలీసులు కూడా ఈనెల 12, 15 తేదీల్లో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 35 మందిపై కేసు నమోదు చేసి మంగళవారం నాల్గవ కోర్టు జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించనట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

భూతగాదాల్లో తండ్రీకుమారుడికి గాయాలు


గాయపడ్డ నవీన్

బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల్లో తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. కొరివారిపల్లె దళితవాడకు చెందిన శంకరయ్య, అతడి కుమారుడు నవీన్ తమ పొలం వద్ద పనిచేస్తున్నారు. భూతగాదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన శంకరయ్య సొంత అన్న చిన్నస్వామి, ఆయన కుటుంబీకులు రాణెమ్మ, హరి, రవి, మహాలక్ష్మి, సెల్విలు కలిసి గొడవపడ్డారు. తర్వాత శంకరయ్య, నవీన్‌పై మూకుమ్మడిగా దాడిచేశారు. నవీన్‌కు తల, చేయిపై తీవ్రగాయాలయ్యాయి. శంకరయ్యకు చేతులు, వీపుపై గాయాలయ్యాయి. బాధితులను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆపై మెరుగైన వైద్య నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సర్వీసు సెంటర్ వద్ద ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొంగారెడ్డిపల్లెకు చెందిన రాజశేఖర్ తన ఎఫ్‌జడ్ ద్విచక్ర వాహనాన్ని ఈనెల 15వ తేదీన సర్వీసు సెంటర్ వద్ద పెట్టాడు. ఆపై పనులు చూసుకుని వచ్చేసరిగా వాహనం కనపడలేదు. దీనిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైతు సేవా కేంద్రంలో ప్రింటర్..

వెదురుకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లె సచివాలయ ప్రాంగణంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో సోమవారం రాత్రి ప్రింటర్ చోరీ చేశారని ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. కార్యాలయం తాళాలు పగులగొట్టి ప్రింటర్ ఎత్తుకెళ్లినట్లు వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

బంగారుపాళ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ మామిడి తోటలో పేకాడుతుండగా దాడి చేశారు. పట్టాభి, మురళి, లోకేష్, దేవరాజులు, క్రిష్ణయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6150 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫొటో స్టూడియోలో షార్ట్ సర్క్యూట్

పూతలపట్టు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గొడుగుచింతకు చెందిన దాము పూతలపట్టులో శ్రీసాయి డిజిటల్ ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. రోజులాగానే మంగళవారం ఉదయం స్టూడియో తలుపులు తెరవగా పొగలు కనిపించాయి. సీఐ కృష్ణమోహన్‌కు సమాచారం ఇవ్వగా వారొచ్చి పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న చిత్తూరు వీడియో & ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నేతలు గణేష్, ప్రకాష్, శంకర్, లోకనాథ్, రాజు, రమణ తదితరులు పూతలపట్టుకు వచ్చి బాధితుడిని పరామర్శించారు.

రిజర్వేషన్ కౌంటర్ వద్ద గొడవలు

నగరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌లో తరచూ ప్రయాణికుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కౌంటర్‌లోని సిబ్బంది తమకు తెలిసినవారితో ఒకలా.. తెలియనివారితో మరోలా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదీగాక వెనుక వచ్చిన వారికి ముందుగా రిజర్వేషన్ వసతి కల్పిస్తున్నారని దీనివల్లే గొడవలు జరుగుతున్నాయని చెబుతున్నారు. రైల్వే అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి చందన అలంకరణ



వెదురుకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరి కొండపై ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మంగళవారం చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏర్పాట్లను ఈవో కృష్ణనాయక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మేళం రవియాదవ్, రాజశేఖర్, సాయి, అర్చకులు కుమార్‌ఆచారి, రవి పాల్గొన్నారు.

ఆడికృత్తిక ఉత్సవాల ఆదాయం రూ.13 లక్షలు

ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి రూ.13,23,922 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాలసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మోహనకృష్ణ, వైద్య సిబ్బంది, ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతులపై అధికారుల విచారణ


విచారణకు వచ్చిన అధికార యంత్రాంగం

వెదురుకుప్పం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొమరగుంట పంచాయతీ బందార్లపల్లె సమీపంలోని ఎద్దలబండ క్వారీ అనుమతులపై అభ్యంతరం చేస్తూ కలెక్టర్‌కి ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో మంగళవారం మైన్స్, రెవెన్యూ, పోలీసులు తనిఖీ నిమిత్తం గ్రామానికి వచ్చారు. ఎద్దలబండ క్వారీకి అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం చేస్తూ ఆ గ్రామస్తులు ఫిర్యాదులు చేశారు. మైన్స్ జియాలజిస్ట్ రాంప్రసాద్, మైన్స్ సర్వేయర్ అజిత, తహసీల్దార్ బాబు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య తదితరులు విచారించారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కి ఇస్తామని వారు తెలిపారు.

బీజేపీ చేతిలో ఎన్నికల కమిషన్ కీలుబొమ్మ: కాంగ్రెస్


పుల్లూరు క్రాస్ రోడ్డులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేతిలో ఎన్నికల కమిషన్ కీలుబొమ్మగా మారి, పోలింగ్ వ్యవస్థను తారుమారు చేసిందని గంగాధరనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ ఆరోపించారు. మంగళవారం రాత్రి పుల్లూరు క్రాస్ రోడ్డులో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఓటును చోరీ చేశారంటూ నినాదాలు చేశారు. నాయకులు నాదముని రెడ్డి, గౌతమ్, గోవర్ధన్, బండ్ల సుబ్బరాయులు, మోహన్, గోవింద, కుప్పయ్య, జయచంద్ర, వెంకటేష్, యుగంధర్ నాయుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.